


# ఉన్నతశిఖరాలు

ఇలాంటి యిల్లు తనదీ అనిపించుకోడానికి శంకరయ్య 'పరమలుబ్ధుడు' అన్న బిరుదును ప్రజనించి సంపాదించుకున్నాడు.

ఈ ఇంటికి తూర్పువేపు ఖాళీస్థలంలో చుక్కల్లాంటి గడ్డిపూలు, డాబా యెక్కనక్కర్లేకుండానే పడకటింట్లో గది ఏ కిటికీదగ్గర నిల్చున్నా – సముద్రగర్భంనించి వుదయించే సూర్యుడు – నురగలతో మెరుగులు పెట్టుకునే కెరటాలు – సుందరి చేతులతో సైగలు చేస్తున్నట్లు కదిలే కొబ్బరికొమ్మలు – రాత్రయితే తెప్పలా తేలిపోయే చంద్రబింబం – ఆ చిరునవ్వు వెలుగులో చిందులు త్రొక్కుతూ మెలికలుతిరిగే సముద్రం. కూర్చుని కులాసాగా పచ్చదనాన్ని నమిలి మ్రింగుతున్న యేనుగులాంటి కొండ. తెరలుమార్చే రంగస్థలంలాంటి ఆకాశం. యింకా యెన్నెన్నో అందాలు, ఆ అందాలు అందించే వూహలు, ఆ వూహాలు యిచ్చే ఆనందం ఈ యిల్లొక స్వర్గధామం అతనికి...

ఇలాంటి యింట్లో యెవరుంటున్నారు? తనూ తన భార్య. ఈ భార్య

యెంత చక్కనిదో అంత గుణవతి ఆతని దృష్టిలో. ఆమె అతనికి యెదురాడి యెరుగదు. తన లుబ్ధత్వానికి కారణాలు తెలుసున్నట్లు సహాయపడిందిగానీ అనవసరంగా డబ్బు ఖర్చుపెట్టలేదు. పిల్లలు యెదిగి కంట పడ్తుంటే వయసు వచ్చేసిందన్న వూహ కలిగేది. పిల్లలు లేని కొంపలో అతను నిత్యయవ్వను డనుకునే మసలుతున్నాడు.


ఈ యింట్లోదిగి రెండేళ్ళు దాటాయ్. ఒకరోజు సాయంత్రం శంకరయ్యవచ్చి కుర్చీమీద కూలబడిపోయాడు. భార్య గాభరా పడింది తల తిరుగుతుందన్నాడు. డాక్టరు అవసరంలేదన్నాడు. ఆ రాత్రి పడకగదిలో కిటికీదగ్గరనిల్చుని చీకటిలో చుక్కలతో సింగారించుకున్న ఆకాశంవేపూ, భూమ్మీద ముద్దులొలికే గడ్డిపూలు నిద్రపోతుంటే వాటివేపు చూడ్డానికి ప్రయత్నిస్తూ కళ్ళల్లో నీరు తెచ్చుకున్నాడు

"సరి – ఈ గడ్డిపూల పీకలు తెగిపోతాయి – ఈ అందానికీ మనకూమధ్య ఒక నల్లని తెర పడిపోయింది "

భార్య ఆతృతతో దగ్గరకు వచ్చింది. "ముప్పయి సంవత్సరాలు గొడ్డులా కష్టపడి నోరు కట్టుకుని గడించిందంతా యీ యింటికిందే అయిపోయింది జరగక ఒకడు అమ్మేశాడు. మూలుగుతున్న డబ్బు విరజిమ్మి యింకొకడు కొనేశాడు. నేను ఈ యింటి జాగా చదరపుగజం అయిదు రూపాయలకు కొన్నానా, దానిధర తెలుసా? చదరపు గజం ముప్పయి రూపాయలు!"

ఇంకా శంకరయ్య మనసు కుదుట పడకుండానే తూరుపు ప్రక్క జాగాలో రెండంతస్థుల మేడ లేచిపోయింది మేడ పైపైకి లేస్తుంటే అదో బ్రహ్మరాక్షసి అన్నభయం ఆవరించి అటుకేసి చూడలేదు ఎవరుకొన్నారు? యెవరు కట్టిస్తున్నారో వూసేలేదు అతనికి! ఈ యింటినే అంతకంటె యెత్తైనమేడచేసి ఆ అందాలను తిలకించలేనన్న విస్పృహ తనను వెంటాడుతోంది. రోజురోజూ యింట్లో చీకట్లు అలముకుని పగటిపూట కూడా పడగ్గదుల్లో దీపాలు వెలిగించుకునే అవస్థ రాగానే అతనికి మనసు కూడా చీకటితో అట్టుడికి పోతోంది. ఇదివరకు కిటికీలగుండా వీచే సముద్ర పవనాలు కరువుకాగానే ఒళ్ళంతా ముచ్చెమటలు పోసేది. అతను యీ యింటి కోసం పడ్డ తాపత్రయం అంతా కళ్ళకు గట్టి యింత ప్రయాస బూడిదలోపోసిన పన్నీరయిందనీ – దానికి కారకులైన పొరుగింటివారు పరమ శత్రువులై కూర్చున్నారు.

"చిన్నప్పుడు పాకలో వుండేవాడ్ని. కంపు; వర్షంవస్తే తడిసి ముద్దయ్యే వాడ్ని. ఒకగాలివాన రాత్రి యెదురుగా వున్న అందమైన యింట్లో తలదాచుకున్నాను. ఆ చక్కదనం – ఎక్కడ




వస్తువులక్కడ. గంజితాగినా యింటి సుఖంవలన మనిషికి ఆనందం వస్తుందని దానికోసం శ్రమించాను ఒకరికి అన్యాయం చెయ్యలేదు. వడ్డీవ్యాపారం చెయ్యలేదు కష్టార్జితంలో కడుపు కట్టుకుని దాచాను ఒకరికి ఒక్కరూపాయి పూరికనే యిచ్చినట్లు జ్ఞాపకంలేదు నా కోసం అత్యవసర పరిస్థితివస్తేగానీ ఖర్చుపెట్టలేదు."

ఇలా యెన్నెన్నో అంటున్నాడు- అనుకున్నాడు ఒకరికి యింత బిచ్చమైనా వెయ్యని శంకరయ్య, పొరుగునే పెద్ద కోలాహలంవిని బయటకువచ్చాడు. బిచ్చమేస్తున్నది బ్రహ్మరాక్షసి అని పోల్చుకున్నాడు. అవును బంగారమ్మే- నిజంగా అది తన వూహలో బ్రహ్మరాక్షసి. దాని సంగతి వూర్లో యెవరికి తెలియదు!

"దేముడా! ఎలాంటి పతివ్రత పొరుగునకు యెంతటి కులట దాపురించింది?" అని తల కొట్టుకున్నాడు బంగారమ్మే ఆ జాగా కొంటుందని తెలిస్తే తనయింటి మీద అప్పుచేసైనా ఆ జాగా తనేకొనేసేవాడు! వేలం వెఱ్ఱిలా పరిణమించేది. దానికేం యెంత డబ్బిచ్చయినా కొంటుంది? ఒక్క వాలుచూపుతో, ఒక్క ఒక్కక్షణం అమ్ముకొన్నది తన అందమైన దృశ్యాలన్నీ కాల్చేసింది వస్తువుకు ఖరీదుగానీ వలపుకు ఖరీదేమిటి? ఆ మేడ పాపం డబ్బుతో లేచింది ఆ పాపం యీ మేడలో యెండినకర్రలై


దాగుంది. తను విప్పంటించేస్తే మేడ బుగ్గవుతుంది. తప్పదు "

శంకరయ్యలో రోజుకు రోజూ విప్పు రాజుకుంటూనేవుంది పొరుగునే కార్లపై వచ్చేవాళ్ళంతా సరసులే అని తన నమ్మకం. ఆ రంగు రంగుల పిల్ల, రత్నాలరాసులనే మరిపించేపిల్ల. చూస్తే నమిలి మింగేయా లనిపించే యౌవ్వని. అందాన్నంతా నాట్యభంగిమలతో విర జిమ్మే వంపులుతిరిగిన సుందరి. దశ దిశలనుంచీ మూంచెత్తుకువచ్చే వలపు లన్నీ ఒకచోటచేరి, యేకమై, యీ వలపు కన్నియను వరించాయి— ఆ మం దాకిని, బంగారమ్మ కూతురు అని చెప్పు కుని మురిసిపోతుంది — విజంగా అది యెవరికూతురో ?

రోజుకురోజూ, సహించరాని సంఘ టనలతో శంకరయ్య అట్టుడికి పోతు న్నాడు. బిచ్చం పేరుతో అడ్డమైన రోగులూ, దొంగలూ యీ వీధికి దాపు రించారని తనబాధ. ఈ మేడ లేనిముందు యీ వీధి యెంత ప్రశాంతంగా వుండేది? ఈ బ్రహ్మరాక్షసి నవ్వు ఒకోసారి విని చెవులు మూసుకునేవాడు. బంగా రమ్మ వయసుమళ్ళినా యింకా నైలాన్ చీరలు కడుతుంది — పెద్ద కుంకుమబొట్టు. తలనిండా పూలు — బహుశః జుత్తుకు వాసననూనె రాసేముందు రంగు రాస్తుం దని తన నమ్మకం. ఒళ్ళుచేసి కండలు వసులై వ్రేలాడుతున్నా వయ్యారపునడక వంకర కాలేదు. హుందాతనం పోలేదు. ఈ హైక్లాసువృత్తికి హైక్లాస్ డ్రస్‌లే. ఇంట్లో ఫోను. వీధిలో తిరగడానికి కారు ఇంటిముందు అందమైన తోట. రంగు రంగుదీపాలు. ఇది పొరుగుకువచ్చి తన ఆధిక్యతను చంపేసింది. ఇదివరకు తన యింటి అందాన్ని మెచ్చుకునేవాళ్లు ఈమె యింటిని మెచ్చుకుంటున్నారు. శంకరయ్య యివన్నీ చూసి పెళ్ళాం యెదరవగానే అక్కసు వెళ్ళక్కేడు

"చూడు — ఆ మేడలో యిప్పుడు కళ పేర యెంత భాగోతం జరుగుతోందో? అందులోవున్న మనిషి ఒళ్ళు అమ్ము కున్న మనిషనితెలిసీమరీ — చూడు దాని చుట్టూ యెందరు చేరుతున్నారో? ముందు — పాపాలన్నీ కప్పుకోడానికి దానాలు చేస్తోంది. — కళాపోషకురాలట — దానిని కళాసేవ, సంఘసేవ చేసే సంఘాలు అధ్యక్షురాలుగా యెన్ను కుంటున్నాయి. ఈ దబ్బే యింత పాపాన్ని పొట్టలో పెట్టుకుని నవ్వుతుందంటే నేనీ డబ్బుని గడించకపోదును."

ఈ వుత్తమ యిల్లాలు, మగడి వుపన్యాసాలకు, మామూలుగా యెదు రాడలేదు. అలా యెదురాడనందుకు భార్యను మనసులో యెంతో మెచ్చు కున్నాడు. పొరుగువాళ్ళతో తగవులాట కోసం ఏదైనా సాకు కోసం యిన్నాళ్ళూ యెదురు చూస్తున్న శంకరయ్యకు యీ



వేళ దొరికింది. ఈ నాటికివరకు పొరుగున యెవరున్నారనైనా ఆమె అడగనందుకు లోలోన కోపంవున్నా, ఆమె అడగకపోవటమే మంచిదని సమర్థించుకునేవాడు. వాళ్ళ పెరటనున్న కోళ్ళుగానీ, యింట్లోవున్న కుక్కగానీ వీళ్ళ పెరటివైపుయింతవరకూ రాలేదు. పోనీ వీళ్ళ పడక గదుల్లోని కిటికీలకు యెదరగా వున్న వాళ్ళ డ్రాయింగు హాలు కిటికీల నించి, యెవరైనా తొంగిచూసారా అంటే అదీలేదు. రెండు రకాల కర్టెన్లు యెప్పుడూ వాళ్ళ కిటికీలపై వ్రేలాడుతుండేవి.

ఈవేళ మందాకికి పుట్టినరోజు. రాత్రి యెనిమిదిదాటాక వాళ్ళడ్రాయింగు రూములో గొప్ప కోలాహలంగావుంది. ఎన్నో కార్లు రోడ్డుమీద నిలిచ్చొని వున్నాయ్. తక్కువస్థాయిలో రికార్డు సంగీతం వినిపిస్తోంది. వచ్చిన వాళ్ళు పకపక నవ్వుతున్నారు. మొదట పొర


పాటునైనా వాళ్ళను చూడకూడదని శంకరయ్య కిటికీలు మూసేసాడు. చీకటి చిక్కనౌతున్నకొద్దీ ప్రశాంతత అధిక మౌతోంది. చివరికి మధురగాయని గాత్రం అనుసరిస్తున్న వీణానాదం. కొద్దిక్షణాల్లో కిటికీలు తెరవకుండా వుండలేక పోయాడు. తనూ భార్య పరుపుమీద చీకట్లో జారబడి వింటు న్నారు

ఇంతలో కిటికీవించి వాన జల్లులా వచ్చి యిద్దరిమీద పడింది. ఆ కిటికీ వించి విసరిన పానీయం స్పిరిటుకంపు ఆ స్పిరిటుకు అగ్గి అంటుకున్నట్లయింది. ఫ్యూజు తగిలించుకున్న బాంబులా వాళ్ళింట్లోకి పరుగెత్తుకవెళ్ళి ధన్‌మని పేలిపోయాడు.

జరిగిన సంగతి యిది. ఆ వచ్చిన అతిధులలో ఒక జంటవున్నారు. అతను బాగా తాగేవాడు. కానీ పిల్లల యెద రగా పడేవాడు కాదు. ఒకనాడు పది వాళ్ళువేసిన ప్రశ్నలు తరువాత తెలుసు కొని, సిగ్గుపడి, మరి యెప్పుడూ తాగ నని పెళ్ళాందగ్గర ఒట్టు వేసుకున్నాడు. ఈ వేళ మళ్ళీ విస్కీగ్లాసు పట్టుకోగానే భార్యకు కోపంవచ్చి గబగబా ఆ గ్లాసు లాక్కొని కిటికీ దగ్గరకువచ్చి విసిరే సింది.

ఈ విషయం వినే పరిస్థితిలో శంక రయ్యలేడు. ఇన్నిరోజులుగా తనలో రగుల్కొంటున్న కోపాన్నంతా ఆమె శీలాన్ని దుయ్యబట్టుతూ ఆమె చేస్తున్న పనుల ఆంతర్యం చాటుతూ వెళ్ళగ్ర క్కాడు. అందులో ఒక యువకుడు శంకరయ్యపై చెయ్యి చేసుకోడానికివస్తే బంగారమ్మే అడ్డుకుంది. క్షమించమని కోరుతోంది. బ్రతిమాలుతోంది. శంక రయ్య పిడుగులా విజృంభించి, గబగబ తిరిగివచ్చేస్తూ ఈ హైక్లాసువ్యాపారం అంతుచూస్తానన్నాడు. ఈ మేడకూల్చేస్తా నన్నాడు. ఈ పశువులని కసాయివాడి దగ్గరకు పంపిస్తానన్నాడు. వెర్రెత్తి యింకేవేవో బూతులుకూడా వాగాడు. ఇంటికి వచ్చినా శరీరం యింకా మండుక పోతోంది. బ్రతికింది బతుకు, కాకి బతుకు కుక్కబతుకు అంటూ కిటికీదగ్గర విల్చొని యీసడించాడు. కాస్సేపయ్యాక ప్రక్కయింట్లో కిటికీతలుపులు వేసుకు న్నారు. పెద్ద శబ్దమేమీ వినపడలేదు. కార్లు వెళ్ళిపోవటం చూసాడు. ఒక్కొ క్కరిమీద ఒక్కొక్కరాయి విసరాలని పించింది.

ఆ మరుసటిరోజు అవతలివాళ్ళు కిటి కీలు తెరిచారని శంకరయ్య యిటువేపు కిటికీలు గడియలు వేసాడు. ఇంత కష్ట పడి గడించిన తన డబ్బుకే విలువలే నట్లు – ఒళ్ళు అమ్ముకుని సులువుగా పాపంచేసి గడించి, మేడలూ మిద్దెలూ చేసుకున్న బంగారమ్మ డబ్బుకే విలువ వున్నట్లు అనిపించింది ఆమె యిప్పుడు, యిదివరకు తనకు నిత్యం ఆనందాన్ని




యిస్తుండిన దృశ్యాలు చూడగలుగుతోంది. తనదీ అనుకున్న అందాన్నంతా సులువుగా దోచుకుంది. ఎందుకిలా జరగాలి? న్యాయంకి నీతికి కాలంకాదు అనుకున్నాడు.

ఇంకా తనలో అలముకొన్న పగ చల్లారకుండానే ఒక విషాద సంఘటన జరిగింది. కొద్దిగా చీకటి పడుతున్న వేళ శంకరయ్య వీధిలోనించి తిరిగి వస్తున్నాడు. తనయింటి యెదరగానే ఒక మోటారు సైకిలుమీద వచ్చే కుర్రాడు తనను గుద్దించేసాడు. అటు వేపునించి వచ్చే రిక్షాతో ఢీకొనకుండా తనపైన పడ్డాడు. పడ్డవాడు లేచి మోటారుసైకిలు పైకెత్తి తొక్కుతూ చక్కా పోయాడు. యీ దురంతరం కోరి బంగారమ్మే చెయ్యించిందని శంకరయ్య నమ్మాడు. అలాంటి మోటారు సైకిలు వాళ్ళెందరో బంగారమ్మ యింటికి వస్తూంటారు. తప్పదు - అదేపగ సాధించుకోడానికి చేసింది. చావే తనకొస్తే యెంత బాగుండును. మరణవాగ్మూలంలో బంగారమ్మ గుట్టంతా పేపర్లలో పడి దాని పరువంతాపోను.

శంకరయ్య వద్దనుకున్నా వెంటనే అక్కడకు వచ్చింది బంగారమ్మ కారే!


మందాకినే ఆసుపత్రిలో చేర్పించింది. తగిలిన దెబ్బలు చిన్నవే, కాని రక్తపోటు హెచ్చుగా వుంది. అతన్ని, అసలు మెడికలు వార్డులో చేర్పించారు. డాక్టరు వాక్కుప్రకారం శంకరయ్యకు షాక్‌వల్లనైనా యీ రక్తపోటు వచ్చి వుండాలి లేక యిదివరకు అతను రక్తపోటుతో బాధపడ్తూ వుండాలి.

"ఇదివరకే అయితే ఆ ముందపల్లే వచ్చివుంటుంది" అనుకున్నాడు శంకరయ్య.

ఆ రాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదు. జనరల్ వార్డు క్రింద గచ్చు నల్లని పలకల రాళ్ళతోవుంది. ఇదివరకు అలాంటి నలుపుచూసాడు. అది నల్లని ఆకాశం-కానీ ఆ నల్లని ఆకాశంపై మిణుకుమిణుకుమనే నక్షత్రాలు-మనిషి బ్రతుకు నల్లనిదైతే...దానిమధ్య మెరిసే నక్షత్రాలలాంటి సంఘటనలు. గుణాలవలన జీవితం అందమౌతుందేమో? - శంకరయ్యలో తను యింకెంత కాలమో బ్రతకనన్న బాధ లేక భయం-తనను ఆలోచింపజేస్తున్నదేమో? న్యాయంగా ఆర్జించే డబ్బు-ఆడబ్బు వెచ్చించి అన్ని సదుపాయాలతో కట్టించుకునే యింట్లో మెసలటంవలనే-మనిషికి సుఖం వస్తుందనీ అలాంటి బ్రతుకే తెల్లని వస్త్రంలాంటి జీవితం అనీ యిదివరకు భ్రమ పడ్డాడు.

ఈ వార్డుచుట్టూ వరండాలు. వరండాలపై కూడా రోగులున్నారు. వరండాలను వైరు కర్టెన్లతో కప్పివుంచారు. గాలి చల్లగావీస్తోంది. సంగీతం వినిపిస్తోంది. ఇదివరలో తను మందాకిని పుట్టిన రోజునాడు విన్న సంగీమంత యింపుగాలేదు. చప్పున తను పడుకున్న బెడ్‌మీద యెందరు చచ్చిపోయి వుంటారో? ఈ చచ్చిపోయిన బెడ్‌పై బాధను భరిస్తూ యెందరు బాగయారో? యీ పరుపు మనిషి జీవితాన్ని కొలిచే కొలబద్దగా వుపయోగిస్తే తనెంత పొడుగుంటాడు? బంగారమ్మ యెంత పొడుగ్గా వుంటుంది?

తెలతెలవారింది. లేచాడు. అప్పటికే వార్డు బాగా శుభపర్చారు. డాక్టర్లు వచ్చేవేళ. నర్సు రొట్టెముక్క తెచ్చింది. ఆకలిగావుందేమో ముక్కముక్క తీసి ప్రక్కకు తిరిగి తింటున్నాడు. కాఫీ తాగాడు. మళ్ళీ బోర్లపడి మంచంపై ఒక ప్రక్కచారబడ్డాడు. - నల్లనిగచ్చు - నిగనిగలాడుతున్న గచ్చు, దానిపై అనుకోకుండా రాలిన రొట్టెపొట్టు-అతనికి కనిపించింది - మనోహర దృశ్యం - చుక్కలకంటె అందమైనదృశ్యం - ఎన్నెన్నో పిచ్చుకలు, కొన్ని బంగారు పిచ్చుకలు - తోకలాడిస్తూ గెంతుతూ వచ్చి ఆరొట్టెముక్కలను యేరుకుంటున్నాయ్. ఉల్లాసంగా గెంతుతున్నాయ్. మూతులు మూతులూ కలుపుకుంటున్నాయ్ — ముద్దులాడుకుంటున్నాయ్. కడుపునిండగా వచ్చిన



తృప్తితో, ఆనందంతో అమర నృత్యం చేస్తున్నాయ్. ఈ దృశ్యం, తనకు — తన యింట్లో బ్రతకడంకంటె ఆనందాన్ని చ్చింది.... ఆ వర్ణించలేని ఆనందం తృప్తితో అలా చూస్తుంటే.... మళ్ళీ నల్లని నేల... ఆ నేలలో కుర్చీ మీద కూర్చున్న బంగారమ్మ — బారులు తీరి నడుస్తున్న ఆకలి బాధతో అలమటించి పోతున్న మానవాళి — ఆమె యిచ్చింది అందుకుని ఆకలిచావును ఒక రోజు దూరంగా నెట్టగలిగామన్న తృప్తితో వెలుగుతున్న ముఖాలతో వస్తున్న మానవ సమూహం — అతని చేతినుంచి రొట్టె పొట్లం పొరపాటున నేలజారింది — కానీ ఆమె కోరి తోటివాళ్ళ పొట్టలు పూడుస్తోంది.

డబ్బు ఆర్జించినప్పుడు మనిషిలో మానవత్వం లేకపోవచ్చు. కానీ డబ్బును వినియోగపర్చేటప్పుడు మానవత్వం యేదో ఒక పాలలో తొంగిచూడాలి. ఎలా ఆర్జించాం అన్న ఆలోచనతో పాటు యెలా ఖర్చుపెట్టాలన్న జిజ్ఞాస కూడా కావాలనుకున్నాడు. బంగారమ్మ తనకంటే మనిషిగా యెంతో వున్నతమైనదని నిర్ధారించుకున్నాడు.